# థాంక్స్

స్పందించే మనసును ఖర్చుపెట్టకూడదు.

—జయప్రద

లక్ష్మణ్ చేతిలోని వి.ఐ.పి. సూట్‌కేసు తీసుకున్నాను.

వాడు జిప్ బ్యాగ్ తగిలించుకున్నాడు.

"ఇంకేమైనా వున్నాయా?" కంపార్ట్‌మెంట్ వైపు చూస్తూ అడిగాను.

"లేవు పద"

ఇద్దరం స్టేషన్ బయటకొచ్చాం.

రిషా మాట్లాడుకున్నాం.

వాడి ప్రక్కన ఇరుగ్గా సర్దుకుని కూర్చుంటూ అన్నాను.

"నీ చదువు ఇప్పటికయినా పూర్తయినట్టేనా?"

వాడు జవాబు చెప్పలేదు.

మేమిద్దరం ఒకేసారి పుట్టాం.

ఒకే తల్లి గర్భంలో ఒకే మాయను పంచుకుని పెరిగి బయట పడ్డాం.

నాకంటే వాడు అయిదు నిముషాలు చిన్న.

కాని ఎంత చిత్రం!

నేను ఇంటర్‌తోనే విసిగి అక్కడే ఆగిపోతే, వాడు జుయాలజీలో పి. హెచ్.డి. పూర్తిచేసుకుని ఇంటికొస్తున్నాడు.

నిజానికి మేమిద్దరం ఏకగర్భ జనితులమే అయినా మాలో ఉండాల్సిన అసూయలులేవు.

మేమిద్దరం మంచి స్నేహితులం

"అమ్మా, నాన్న, బాగున్నారా?" నేను నవ్వుతూ అన్నాను.

"బాగున్నారు. నీకెవరు నచ్చితే వాళ్ళతో నీ పెళ్ళి చేసేయాలని మహా కుతూహలంగా వున్నారు అమ్మా, నాన్న"

నేనాశించినట్టు అతని పెదాలు సన్నగా విచ్చుకోలేదు.

కళ్ళలో కొంచెనవ్వు కూడా కదలాడలేదు.

"నాకిష్టంలేదురా" అన్నాడు ముఖావంగా.

నేను ఆశ్చర్యంగా చూసాను.

ఇన్నాళ్ళు కలిసి పెరిగినా ఇంతవరకు మామధ్య పెళ్ళి గురించిన చర్చ జరగలేదు.

నా పెళ్ళికి ఒక్కరోజు సెలవు పెట్టివచ్చి వెళ్ళిపోయిన వాడి మనసులో అనాడు ఏమి కదలాడిందో నేను గ్రహించలేదు.

నేను అనుమానంగా లక్ష్మణ్ కళ్ళల్లోకి చూసాను.

అతని మాటల్లో నిజాయితీ అతని కళ్ళల్లో ప్రతిఫలిస్తోంది.

"ఏం ఎందుకని?" అతనివైపు తిరుగుతూ అన్నాను.

గతుకుల రోడ్డు మీదుగా మా రిక్షా నాట్యంచేస్తూ పోతోంది.

"ఈ పెళ్ళి సంబంధాలు భవిష్యత్తును కుంచించేస్తాయి. ఆ లంపటం నాకొద్దు"

నేను విస్తుపోయాను.

వాడికి పదహారేళ్ళ వయసు కాదు పెళ్ళంటే సిగ్గుపడి వద్దన డానికి.

పాతికేళ్ళ వయసు కాదు పెళ్ళిమీద సమగ్రమైన అభిప్రాయం లేదనుకోవడానికి.

అప్పుడే మూడు పదులు దాటిపోయినయ్ వాడికి.

"ఏమిటి వాడి మనస్థత్వం?"

"నన్నూ, మీ వదిననూ చూస్తే మీకేమనిపిస్తుంది లక్ష్మణ్!" అన్నాను కుతూహలంతో వాడి మనస్సు తెలుసుకోవాలనే కోరికతో కొంత.

వాడు నవ్వానన్నట్టు నవ్వాడు.

"నాలాగ, అమ్మలాగ నీ జీవితంలోకొచ్చిన కొత్త కంపెనీ"

నేను విస్తుపోయాను.

"నిజమే! ఆమె నా జీవితంలో అమ్మలాగ, నీలాగ నాకు తోడే కానీ ఓ నిజం చెప్పనా లక్ష్మణ్! ఎప్పుడయినా మీ వదిన వాళ్ళ వూరు వెళితే నా కసలు ఇంటికి రావాలనిపించదు. ఒకవేళ వచ్చినా నాకా ఇల్లు చాలా శూన్యంగా అనిపిస్తుంది. ఎందుకంటావ్?"

వాడీసారి పలువరస కన్పించేలా నవ్వాడు.

"నువ్వు బాధపడనంటే నీ ప్రశ్నకు నేను నిజమైన జవాబు చెపుతాను."

చెప్పమన్నట్టు చూసాను.

"నేనూ, అమ్మా నీకివ్వలేని సుఖం వదిన నీకిస్తుంది"

"పోనీ అది నీకొద్దా?"

"అది బజారులో కూడా దొరుకుతుంది."

నేను జుగుప్సగా చూసాను వాడివైపు.

"ఈ విద్యాధికుడి గుండెల్లో అపురూపమైన వివాహబంధం ఎడల ఎంత స్వల్పమైన అభిప్రాయం?"

మనసుకేమాత్రం అశాంతి కలిగినా భార్య ఒడిలో దొరికే ఓదార్పు ఎవరి దగ్గర దొరుకుతుంది?

కష్టాల్లో, సుఖాల్లో తోడనే భావం, ఎప్పటికీ వదిలిపోని బంధం. జీవితకాలపు నేస్తం!

'నువ్వే నేను, నేనే నువ్వు' అనే అపురూపమైన బాంధవ్యాన్ని విడమర్చి ఎలా వాడికి చెప్పడం?

పెద్ద చదువులు చదివినా పెళ్ళంటే జీవిత భాగస్వామి అంటే కేవలం సెక్స్‌కోసం అనుకునే నా తమ్ముణ్ని అలా గాలికి వదిలేయాలని పించలేదు.

వాడి భవిష్యత్తు నాక్కావాలి.

ఎలాగయినా ఒప్పించాలి.

ఆలోచిస్తున్నాను.

నా ఆలోచనలు ఒక దారికి రాకముందే మేమెక్కిన రిక్షా మా ఇంటి ముందాగింది.

అప్పటికి తాత్కాలికంగా వాయిదా వేసినా ఆ సమస్యకి మరో పదిరోజులు గడిచినా పరిష్కారం దొరకలేదు.

ఈ లోపల నా ఆలోచనల్లోనూ కాస్త మార్పొచ్చింది.

పాఠాలులాగ చెప్పేకంటే "ఈ అమ్మాయి లేందే నేను బ్రతక లేను" అనే భావం లక్ష్మణ్‌లో కలిగించే అమ్మాయిని వెతికి అతనికి చూపిస్తే ఎక్కువ వుపయోగముంటుంది

ఇలా నేనాలోచిస్తుండగానే వాడికి హఠాత్తుగా అమెరికా స్కాలర్

షిప్ రావడంతో మా అమ్మ విసుగుడు మరీ జాస్తయింది పెళ్ళి చేసుకోమని.

బలవంతంగా లాక్కెళ్ళి వాడికి రెండు మూడు సంబంధాలు చూపించాను.

అందులో విమలాపురం సంబంధం అమ్మవాళ్ళకు చాలా బాగా నచ్చింది.

కళ్ళు తిప్పుకోలేని అందం.

ఆమె అందంలో ప్రత్యేకత, ముఖంలో ప్రసన్నత, నవ్వకపోయినా నవ్వినట్లుండే పెదాలు, లక్ష్మణ్‌ని ఆ అమ్మాయి ఒక్కచూపులోనే మార్చేసుంటుందనుకున్నాను.

ఇంటికొచ్చాక ప్రయాణపు అలసటలో బాత్‌రూమ్‌లో కెళ్ళబోతూ కుతూహలాన్ని ఆపుకోలేక వెనక్కి తిరిగి అన్నాను.

"విమలాపురం అమ్మాయి పేరు రేణుక అనుకుంటా. అమ్మవాళ్ళకు చాలా నచ్చింది. గుణం, కలుపుగోలుతనం, అన్నీ బాగున్నాయి. బి.ఏ. పాసయిందట. నీకూ నచ్చుంటుంది కదూ"

లక్ష్మణ్ చాలా సేపు మాట్లాడేదు.

ఆ తర్వాత నిట్టూరుస్తూ అన్నాడు.

"నాకు చేసుకోవాలని లేదురా. కానీ అమ్మవాళ్ళకొరకు చేసుకోవాల్సి వచ్చేట్టుంది. ఒకవేళ అమ్మ తృప్తికొరకు చేసుకున్నా ఆమెను ఇక్కడే వదిలివేసి వెళతాను. అమ్మతో నువ్వు చెప్పు"

నేను ఉలిక్కిపడ్డాను.

అమ్మకొరకు చేసుకుంటావా? అమ్మ దగ్గర వదిలేసి వెళతాడా?

"ఈ వెధవకు స్పందించే గుండె లేకపోతే ఆ అమ్మాయికుండదూ?"

ఆ అమ్మాయిలో ఎన్ని కోర్కెలో! ఎన్ని కలలో! ఎన్ని ప్రణాళికలో!!!

ఈ పవిత్ర భారతదేశంలో అనారోగ్యం. ఆర్థిక దుర్బలత్వం, అసూయాద్వేషాలూ, అజ్ఞానం, అమాయకత్వం. మూఢాచారాలు లాచ పుర్లలా బ్రతుకుల్ని తొలిచేస్తుంటే స్త్రీ శీలానికిచ్చిన విలువ వాటికివ్వ బడలేదు.

అందలేని ఆడదాని శీలంమీద నిందలు వేయడానికి ఒకే ఒక్క క్షణమైనా ఆలోచించని దౌర్భాగ్యస్థితిలో వున్న మనుష్యులమధ్య బ్రతుకుతున్న ఆ అడపిల్లను నీ మూర్ఖత్వానికి బలిచేయలేను నేను.

ఒకవేళ కట్నంలేకపోతే నీ అంత శ్రీమంతుడు దొరక్కపోయినా చింతలేదు.

పూవులా చూచుకునేవాడు కాకపోయినా జీవితాంతం ఆమెను భర్తలా భరించేవాడు దొరక్కపోడు.

నీలాటి మూర్ఖుడ్ని చేసుకుని, నువ్వు వదిలివేసి వెళ్ళిపోతే శరీర సుఖాలు, మానసిక సుఖాల సంగతి వదిలివేసినా, పనీపాటాలేని అమ్మ లక్కలు నిందావాక్యాలతో రోజురోజూ చచ్చిపోయే శాపగ్రస్థను చేయ లేను.

నిజానికి నా ఆలోచనలన్నీ వాడికి చెప్పాలని వుంది.

కానీ చెప్పినందువలన ఏ ప్రయోజనాన్ని నేనాశిస్తానో ఆ ప్రయో జనాన్ని చెప్పకుండా కూడా నేను పొందగలను.

అందుకే అంతవరకు ఎలా అయినా వాడికి ఒప్పించి ఆమెతో పెళ్ళి జరిపించాలనుకుంటున్న నేను నిదానంగా అన్నాను.

"నువ్వు బాధపడుతూ చేసుకోవడం ఎందుకు లక్ష్మణ్? అమ్మకు నేనేదో చెపుతాలే. నువ్వు ప్రస్తుతానికి అమెరికా వెళ్ళిపో. నువ్వు పెళ్ళి చేసుకోవాలనిపించినప్పుడు నాకు లెటర్ వ్రాయి"

"థాంక్సరా" నా చేతులు పట్టుకున్నాడు వాడు.

నేను జవాబు చెప్పలేదు. కానీ నా మనసు మాత్రం గొణగనే గొణిగింది.

"ఒకవేళ నాకు థాంక్స్ చెప్పాల్సివస్తే అది ఆ అమ్మాయి చెప్పాలి. నువ్వు కాదు"

❋